క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్యసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్యకళా వేదికపై గుంటూరుకు చెందిన తిరుమల ఆర్ట్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, శివాష్టకం, శివ స్తుతి, లింగాష్టకం, చంద్రశేఖరాష్టకం, శివపంచాక్షరి తదితర గీతాలకు, అష్టకాలకు గీతిక, భవ్య, భవ్యశ్రీ, తులసి, అక్షర, దుర్గ, లీల తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

రైతన్నకు సాగు కష్టాలు



ప్రాతకోట గ్రామం వద్ద కేసీ కాలువకు పైపులు వేసుకుంటున్న రైతులు

పగిడ్యాల: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఖరీఫ్ వర్షధారం కింద సాగు చేసిన మొక్కజొన్న పైర్లు ఎండిపోతున్నాయి. దాదాపు నెల రోజులుగా వర్షం జాడ లేకపోవడంతో కాపాడుకోవడానికి రైతన్నలు తీవ్ర కష్టపడుతున్నారు. కేసీ కాలువకు సమీపంలో ఉండే రైతులు సైఫన్ పైపులు వేసుకుని నీరు పారించుకుంటున్నారు. ఓ వైపు యూరియా కొరత, మరో వైపు వర్షభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

భ్రామరీకి లక్షకుంకుమార్చన



లక్షకుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన సేవను జరిపించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి 40 మంది భక్తులు పరోక్షసేవగా లక్షకుంకుమార్చనలో పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ సర్వేను నిలిపేయాలి

నందికొట్కూరు: ఎస్ఐఆర్ సర్వేను నిలిపేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం పటేల్ సెంటర్‌లో సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. రాజకీయ లబ్ధి పొందేందుకు సర్వే చేసి వలస కార్మికుల ఓట్లను, మైనారిటీ ఓట్లను తొలగించి బోగస్ ఓట్లను చేర్పించి గెలవాలని బీజేపీ, టీడీపీ చూస్తున్నట్లు ఆరోపించారు. బోగస్ ఓట్లతోనే బీజేపీ, టీడీపీ అధికారంలోకి వచ్చాయని ధ్వజమెత్తారు. ధర్నాలో సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, కర్ణ, ఉస్మాన్, ఓబులేసు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సీడ్స్ కార్పొరేషన్ ఆర్ఎం పూజలు

మహానంది: నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ తెలుగు రాష్ట్రాల రీజినల్ మేనేజర్ గజానంద్ సింగ్ శుక్రవారం మహానందిలో పూజలు చేశారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామి వారి దర్శనం అనంతరం ఆయనకు ప్రసాదాలు అందించారు.

480 క్యూసెక్కుల నీటిసరఫరా

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 480 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ శుక్రవారం తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లాకు 1,025 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ఈ నీటిని నిప్పులవాగుకు 490 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 55 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 480 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

23.4 మిల్లీమీటర్ల వర్షం

జూపాడుబంగ్లా: మండలంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు 23.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. మొక్కజొన్న పంట వాలిపోగా, పొలాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. ఎండిపోతున్న పైర్లకు ఈ వర్షంతో కాస్త జీవం వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు.

వరములివ్వు తల్లీ.. వరలక్ష్మీ మాతా!

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- ముత్తైదువులతో కిక్కిరిసిన ఆలయాలు

ఆత్మకూరు: వరములిమ్ము తల్లీ.. వరలక్ష్మి మాతా! అంటూ భక్తులు వేడుకున్నారు. శ్రావణ శుక్రవారం.. వరలక్ష్మీ వ్రతం కావడంతో శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని ఆలయాలు ముత్తైదువులతో కిక్కిరిశాయి. దంపతులు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు. అష్టైశ్వరాలు ఇవ్వాలని వేడుకున్నారు. అనంతరం ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

● ఆత్మకూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఉదయమే పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలు, అమ్మవారి ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. అమ్మవార్లను వరలక్ష్మీదేవిగా అలంకరించి పూజించారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం వల్ల సకల శుభాలు, అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పూజలు తెలిపారు.

● జూపాడుబంగ్లా: శ్రావణమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించుకున్నారు. ఒకరికి ఒకరు పసుపుకుంకుమ, గాజులను వాయనంగా ఇచ్చిపుచ్చుకున్నారు. తాటిపాడు, తర్తూరు, తరిగోపుల, 80బన్నూరు, పారుమంచాల, తూడిచెర్ల, భాస్కరాపురం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



ఆత్మకూరు: శివాలయంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



వెలుగోడు: వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

● మహానంది: నంద్యాలకు చెందిన ఏజీఎస్ జువెలర్స్ అధినేత అవ్వారు గౌరినాథ్, సరస్వతి దంపతుల ఆర్థిక సహకారంతో వరలక్ష్మీ వ్రతాన్ని మహానందిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరు రవిశంకర అవధాని, శాంతరాంభట్లు, తహసీల్దార్ రమాదేవి, ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్‌లు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● వెలుగోడు: మండలంలో వరలక్ష్మీ వత్రాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెలుగోడు, వేల్పనూరు తదితర గ్రామాల ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని పురోహితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పురోహితులుసురేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.



పాములపాడు: తుమ్మలూరు గ్రామంలో..



ఓంకార క్షేత్రంలో..

● పాములపాడు: మండలంలో వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో, గృహాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పురోహితులు వేద మంత్రోచ్చారణలతో గణపతిపూజ, అమ్మవారికి అభిషేకం, అమ్మవారి అష్టోత్రం, గౌరీపూజ, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు.

● బండి ఆత్మకూరు: కుటుంబ క్షేమంతో పాటూ సౌభాగ్యం, ధనవృద్ధి కోసం నిర్వహించే వర లక్ష్మీ, వైభవలక్ష్మీ పూజలను శుక్రవారం మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఓంకార సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలోని గంగా ఉమా సమేత అమ్మవార్లను అలంకరించి, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొత్తపల్లి: అక్షరాభ్యాసంలో భాగంగా చిన్నారికి తేనె తినిపిస్తున్న పురోహితులు

కొత్తపల్లి: సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి దేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుటుంబ సమేతంగా వారి చిన్నారులకు పురోహితుల చేత బీజాక్షరాలు దిద్దిచి, తేనె తినిపించి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

మరకత లింగేశ్వర స్వామికి హరిద్రాభిషేకం

- నేడు మహాలక్ష్మీ యాగం



పూజలందుకున్న మరకత లింగేశ్వరుడు

మహానంది: గాజులపల్లె రైల్వే స్టేషన్ గ్రామంలో కొలువైన గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం, మూడవ శుక్రవారం సందర్భంగా వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్ రావు ఆధ్వర్యంలో అర్చకులు మరకతలింగేశ్వర స్వామికి 100 కిలోల పసుపుతో హరిద్రాభిషేకం నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాన్ని తిలకించారు. శనివారం నవగ్రహ ఆలయాల వద్ద మహాలక్ష్మీ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కనమర్లపూడి తెలిపారు.



యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు మస్తాన్‌రావు, అర్చకులు

కామేశ్వరీ దేవికి పసుపు కొమ్ములతో అలంకరణ

మహానంది: శ్రావణమాసం, మూడవ శుక్రవారం సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, అర్చకుల బృందం 250 కిలోల పసుపు కొమ్ములతో దండలు తయారు చేసి అమ్మవారిని అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కార్మికుల సమస్యలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

శ్రీశైలంప్రాజెక్ట్: కార్మికుల సమస్యలపై ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.ఏసురత్నం సూచించారు. సున్నిపెంటలోని కృష్ణవేణి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కనీస వేతనం ఇవ్వకుండా కాంట్రాక్ట్ కార్మికులు శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. కార్మికులను ఏకతాటిపైకి తెచ్చి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్రాలపై ఉద్యమాలు చేయాలని సూచించారు. సమావేశంలో సీఐటీయూ మండల నాయకులు ఎం.చిన్నమారెన్న, దర్శనం. నాగరాజు, ఎం.మల్లికార్జున, అబ్రహాం, జెడ్డా నాగరాజు, కొడమల యోబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

ఆత్మకూరు: బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్నికల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమని సీపీఐ నాయకులు రణధీర్, సుధాకర్ తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ పౌరసత్వ రిజిస్ట్రేషన్ ఎన్నికల చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన చేపట్టేందుకు కేంద్రం పూనుకుందన్నారు. ఈ విధానం వల్ల ఓటర్ల నమోదుకు పౌరసత్వంతో ముడిపెట్టడం సరికాదని, వెంటనే విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేంద్ర, వీరన్న, నాగేశ్వరరావు, పాల శివుడు, గణపతి, నూర్, రవి, మల్లయ్య, కరిముల్లా, వలి, శ్రీను, బుజ్జి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త బస్టాండు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి



మహానంది ఆలయ ప్రాంగణంలో దుకాణాలు

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వారు తప్పనిసరిగా ప్లాస్టిక్ కప్పులు, కవర్లు నిషేధించాలని ఆలయ అధికారులు ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్య ఆలయాల్లో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని గురువారం దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు మహానంది దేవస్థానం అధికారులు ఆలయ ప్రాంగణాల్లో వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారికి సూచనలు జారీ చేశారు. ప్లాస్టిక్ కప్పులు, ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా నిషేధించాలన్నారు. ఆలయాలు ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా ఉండేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు సీనియర్ ఉద్యోగులను నోడల్ అధికారులుగా నియమించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వస్తువులు వాడితే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రసాదాలను పేపర్ సంచుల్లో అందించాలని, భక్తులకు వడ్డించే అన్న ప్రసాదాన్ని అరిటాకులు లేదా స్టీల్ ప్లేట్లలో పంపిణీ చేయాలన్నారు. ఆలయ పరిధిలో భక్తులకు తాగు నీటి సౌకర్యాలు కల్పనలో భాగంగా ఎక్కువగా ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారని అధికారులు తెలిపారు.

బీటలు వారిన హైవే రోడ్డు

జూపాడుబంగ్లా: రూ.కోట్ల నిధులను వెచ్చించి నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మాణం పనులు నాసిరకంగా కొనసాగుతుండటంతో చిన్నపాటి వర్షం కురిసినా ఎక్కడికక్కడా కల్వర్టులు, అండర్ పాస్ వంతెనలు కుంగి రోడ్డు బీటలు వారుతోంది. తాటిపాడు సమీపంలో నిర్మించిన అండర్‌పాస్ వంతెనపైన రోడ్డు బీటలు వారింది. మరో భారీవర్షం కురిస్తే రోడ్డు సైడ్ రివిట్‌మెంట్ కూలిపోయే ప్రమాదం ఉంది. వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవటంతో వంతెను ఇప్పటికే బీటలు వారగా చిన్నపాటి వర్షం కురిసినా బీటల్లోంచి వర్షం నీరు లీకేజీ అవుతుంది. అలాగే వంతెనపైన రోడ్డు బీటలు వారటంతో రోడ్డు పర్యవేక్షణలో డొల్లతనం వెల్లడవుతుంది. రూ.కోట్ల నిధులు వెచ్చించి నిర్మిస్తున్న జాతీయరహదారి 340సీ రోడ్డు పదికాలాల పాటు మన్నికగా ఉండేలా నిర్మించాల్సి ఉండగా నాసిరకంగా నిర్మిస్తే ఎలాగని ప్రయాణికులు, డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు.



తాటిపాడు అండర్‌పాస్ వంతెనపైన బీటలు వారిన ఎన్‌హెచ్340సీ రోడ్డు

అన్న ప్రసాద పథకానికి విరాళం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్ నగరానికి చెందిన చావలి అనురాధ శుక్రవారం రూ.10 వేలు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు. దాతకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి సత్కరించారు.

రైల్వే గేటు వద్ద మరమ్మతులు

- ఆగిపోయిన వాహనాలు

మహానంది: గాజులపల్లి రైల్వే స్టేషన్ గేటు వద్ద గేటు తీగలు దెబ్బతినడంతో శుక్రవారం కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి. గిద్దలూరు నుంచి మహానంది మీదుగా ప్రయాణిస్తున్న వాహనాల రాకపోకలు స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రైల్వే సిబ్బంది మరమ్మతులు చేపట్టడంతో కొద్దిసేపు అనంతరం యథావిధిగా రాకపోకలు కొనసాగాయి.

నేడు పవర్ కట్

వెలుగోడు: మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవీంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల విద్యుత్ పరిధిలోని అన్ని సబ్ స్టేషన్లలో మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

పగిడ్యాల: స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ క్రాంతికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 5 నుంచి 8.30 గంటల వరకు లక్ష్మాపురం, ప్రాతకోట, ముచ్చుమర్రి ఫీడర్‌కు సరఫరా ఉంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు యథాతథంగా సరఫరా కొనసాగిస్తామని బావులు, బోర్లు కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

నేడు తాటిపాడులో వేంకటేశ్వరస్వామి కల్యాణం

జూపాడుబంగ్లా: శ్రావణమాస శనివారాన్ని పురస్కరించుకుని తాటిపాడు గ్రామంలో శనివారం వీరభద్రస్వామి ఆలయం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వీరభద్రస్వామి సేవాసమితి సభ్యులు తెలిపారు.

మద్దిలేటి స్వామికి బంగారు ముఖావళి బహూకరణ

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా స్వామి వారికి కర్నూలు నగరానికి చెందిన కుమారి లాశికా రామ్, కుమారి జ్యోశికా రామ్ బంగారు పూత ముఖావళిని సమర్పించారు. అలాగే..బండిఆత్మకూరు మండలం, ఎర్రగుంట్ల పల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి.. మహాలక్ష్మి అమ్మవారికి బంగారు పూత కవచం అందజేశారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేద పండితులు దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వదించారు.



మద్దిలేటి నరసింహస్వామికి బంగారు పూత ముఖావళి



మహాలక్ష్మి అమ్మవారికి బంగారు పూత కవచం

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, రింగ్ రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్ధరామప్ప కొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరిప్రదక్షిణలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



స్వామిఅమ్మవార్ల పల్లకీని శ్రీశైల గిరిప్రదక్షిణకు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు

●తాగు..ఊగు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం విచ్చలవిడిగా లభిస్తోంది. దీంతో మందుబాబులు తాగి ఊగుతున్నారు. మత్తు ఎక్కువై ఎక్కడిపడితే అక్కడ పడిపోతున్నారు. మత్తు దిగే దాకా వారు ఎక్కడున్నారో కూడా తెలియకుండా ఆదమరుస్తున్నారు. పాములపాడు బస్టాండ్ సెంటరులో హోటల్ ముందు ఓ వ్యక్తి శుక్రవారం మందు ఎక్కువై ఇలా పడిపోయాడు. అది చూసిన హోటల్ వారు, హోటల్‌కు వచ్చిన వినియోగదారులు ఈసడించుకున్నారు.



– పాములపాడు

పల్లకీలో మహానందీశ్వర దంపతులు



పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం కనుల పండువగా సాగింది. ధ్వజస్తంభం వద్ద హారతులు ఇచ్చి పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను తిరిగి యథాస్థానానికి చేర్చారు.

చెంచులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపాలి

కొత్తపల్లి: గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యాలను ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి స్వాములు, మండల నాయకులు కే దినేష్‌లు కోరారు. శుక్రవారం చదరం పెంటలో గిరిజనులు సాగు చేసుకున్న పంట పొలాలను సీపీఎం మండల కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెంచు గిరిజనులు పొలాలకు రక్షణగా వేసుకున్న కంచెను ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా తొలగించడానికి యత్నించడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ గోపాల్, రవికుమార్ పాల్గొన్నారు.



గిరిజన రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

యూరియా కొరత తీర్చాలి

నంద్యాల (న్యూటౌన్): జిల్లాలో యూరియా కొరతను నివారించి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సీపీఐ మహాసభలు పూర్తి చేసుకొని రాష్ట్ర మహాసభలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బిహార్ ఎన్నికల్లో పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని, ఎన్నికల కమిషన్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆపరేషన్ ఖగార్ పేరుతో మావోయిస్టులను అంతమొందించి అక్కడ విలువైన సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రపన్నుతుందని ఆరోపించారు. జిల్లాలో రైతులు యూరియాతో ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం యూరియా కష్టాలు తీర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు హెచ్చరించారు.